సాక్షి కామారెడ్డి

మంగళవారం । 15 । ఆగస్టు । 2023



డిమాండ్లను నెరవేర్చాలి

న్యాయమైన తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ రెండో ఏఎన్‌ఎంలు తహసీల్దార్‌లకు వినతిపత్రాలు ఇచ్చారు.

- IIIలో ▸



రోడ్డు బాగు చేయాలి

రోడ్డును బాగు చేయాలని డిమాండ్ చేస్తూ తాడ్వాయి మండలంలోని ఎండ్రియాల్ గ్రామస్తులు రాస్తారోకో చేశారు.

- IIIలో ▸

గరిష్టం/కనిష్టం

34.7 /21.9

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్‌గా ఇందిర



కామారెడ్డి టౌన్: కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్‌గా ఇందిర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన డీఎం లక్కు మల్లేశంను కరీంనగర్ డిపో–1కు డీఎంగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయం బస్ భవన్‌లో విధులు నిర్వహిస్తున్న ఇందిరకు పదోన్నతి కల్పించి, కామారెడ్డి డీఎంగా పంపించారు. ఆమెకు ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ లింగమూర్తి, ఎస్టీఐ మంజుల, మెకానికల్ ఇంజినీర్ వసుంధర తదితరులు పాల్గొన్నారు.

18న జెడ్పీ సర్వసభ్య సమావేశం

కామారెడ్డి అర్బన్: జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 18న నిర్వహించనున్నారు. చైర్‌పర్సన్ దఫేదార్ శోభ అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో డి.సాయాగౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

డీఎంహెచ్‌వోకు సమ్మె నోటీస్



కామారెడ్డి టౌన్: తమ ఉద్యోగాలను ప్రభుత్వం క్రమబద్ధీకరించకుండా కాలయాపన చేయడాన్ని నిరసిస్తూ బుధవారం నుంచి సమ్మె చేయనున్నట్లు మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్ తెలిపారు. సోమవారం డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్‌కు సమ్మె నోటీస్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏఎన్‌ఎం పోస్టుల భర్తీ పరీక్షను రద్దు చేసి కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు సరోజ తదితరులు పాల్గొన్నారు.

‘క్రీడలతో మానసిక ఉల్లాసం’



కామారెడ్డి టౌన్: క్రీడలు మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అతిమాముల శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం న్యాయవాదులకు క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యం కేసులతో బిజీగా ఉండే న్యాయవాదులు ఆటల వల్ల ఉత్సాహం పొందుతారన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా కామారెడ్డి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు క్యారమ్స్, చెస్, టేబుల్ టెన్నిస్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బండారి సురేందర్‌రెడ్డి, కోశాధికారి సూర్యప్రసాద్, స్పోర్ట్స్ సెక్రెటరీ శ్రావణ్ గౌడ్, న్యాయవాదులు జగన్నాథం, శంకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, అమృతరావు, సంజీవరావు, శ్రీధర్, లక్ష్మణరావు, ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో బీజేపీ నేతల నిరసన



కామారెడ్డి టౌన్: దేశ విభజన జరిగిన ఆగస్టు 14 ఉన్మాద దినమని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్ పేర్కొన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నేతలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. దేశ విభజన సందర్భంగా జరిగిన హింసలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భరత్, కౌన్సిలర్ నరేందర్, నాయకులు నవీన్, వీరేశం, రాజేష్, నవీన్ పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, వేదికపై ఎమ్మెల్యేలు సురేందర్, గంప, రసమయి, రాజ్యసభ ఎంపీ సురేశ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ శోభ తదితరులు



గులాబీ శ్రేణుల్లో జోష్!

- ఉత్సాహం నింపిన కేటీఆర్ పర్యటన
- ప్రత్యర్థి పార్టీలపై విరుచుకుపడ్డ మంత్రి
- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్‌పై పొగడ్తల వర్షం
- 70 వేల మెజారిటీతో గెలిపించాలని కార్యకర్తలకు పిలుపు
- ‘గంప’ నేతృత్వంలో కామారెడ్డిలో అభివృద్ధి అంటూ ప్రశంస
- కామారెడ్డి, ఎల్లారెడ్డిల అభివృద్ధికి రూ.90 కోట్లు మంజూరు

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కేటీఆర్ జిల్లా పర్యటన గులాబీ శ్రేణుల్లో జోష్ నింపింది. ఆయన తన మాటలతో ప్రత్యర్థి పార్టీలపై విరుచుకుపడ్డారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యేపై పొగడ్తల వర్షం కురిపించారు. పనిలోపనిగా వచ్చే ఎన్నికల్లోనూ ఎల్లారెడ్డిలో తమ పార్టీ అభ్యర్థిగా సురేందరే బరిలో ఉంటారన్న విషయాన్ని స్పష్టం చేశారు.

సాక్షి, కామారెడ్డి : ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో సోమవారం కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాలలో మంత్రి కేటీఆర్ పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఎల్లారెడ్డి పట్టణంలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. ఎమ్మెల్యే సురేందర్ సీఎం కేసీఆర్‌ను, మంత్రులను కలిసినప్పుడల్లా తమది వెనకబడిన నియోజకవర్గమని, నిధులివ్వాలని అడుగుతాడే తప్ప ఏనాడూ సొంత పనుల మీద ఆసక్తి చూపలేదన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ ఉద్యమం మొదలుపెట్టిన 2001లో సురేందర్ గులాబీ జెండా కప్పుకుని కేసీఆర్ వెంట రాష్ట్రమంతటా తిరిగాడన్నారు. ఆ సమయంలో కేసీఆర్ వెంట నడిచిన వారిలో సురేందర్ ఒకరన్నారు. రాజోలిబండా పాదయాత్ర కోసం వెళ్తున్న నాయకులకు కార్లలో డీజిల్ పోసుకునే పరిస్థితులు లేక ఇబ్బందులు పడుతుంటే అప్పుడు పెట్రోల్ బంకులు ఉన్న సురేందర్ వందలాది కార్లలో పెట్రోల్ పోయించి అండగా నిలిచాడన్నారు. 2001 లో స్థానిక సంస్థల ఎన్నికలలో కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో 12 మండలాలకుగాను 10 మండలాల్లో గులాబీ జెండా ఎగిరిందని, ఆ గెలుపులో సురేందర్ కృషి ఎంతో ఉందని పేర్కొన్నారు.



ఎల్లారెడ్డి బస్టాండ్ వద్ద మంత్రులు కేటీఆర్, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సురేందర్‌లకు గజమాలతో సత్కారం

భారీగా నిధులు..

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో బీటీ రోడ్లు, వంతెనల కోసం రూ.20.31 కోట్లు, మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు మరో రూ.25 కోట్లు మంజూరు చేసిన పత్రాలను మంత్రులు కేటీఆర్, ప్రశాంత్‌రెడ్డి ఎమ్మెల్యే సురేందర్‌కు అందించారు. కామారెడ్డి పట్టణంలో అంతర్గత రోడ్లకు రూ.25 కోట్లు, స్టేడియం అభివృద్ధి, స్పోర్ట్స్ కాంప్లెక్సులకు రూ.20 కోట్లు మంజూరు చేస్తున్నట్టు మంత్రి కేటీఆర్ ప్రకటించారు.

ఈసారి రెట్టింపు మెజారిటీ ఇవ్వండి..

మొన్నటి ఎన్నికల్లో సురేందర్‌ను 35 వేల మెజారిటీతో గెలిపించిన ప్రజలు.. ఈసారి అంతకు రెట్టింపు మెజారిటీ ఇవ్వాలని కేటీఆర్ కోరారు. నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేస్తున్న సురేందర్ శాశ్వత ఎమ్మెల్యేగా చరిత్రలో నిలిచిపోయేలా ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఎల్లారెడ్డి పట్టణంలో ఇటీవలే మంత్రి హరీశ్‌రావు వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశాడన్నారు. ఎల్లారెడ్డిలో లక్షా మూడు వేల మంది రైతులకు రైతుబంధు అందుతోందని, రాష్ట్రంలో అత్యధిక రైతుబంధు పొందుతున్న నియోజకవర్గాల్లో ఎల్లారెడ్డి మొదటి ఐదు స్థానాల్లో ఉందని పేర్కొన్నారు.

షబ్బీర్‌అలీది పాచిపోయిన ముఖం

కాంగ్రెస్ నాయకుడు షబ్బీర్ అలీ, ఆ పార్టీ నాయకులు పాచిపోయిన ముఖాలని మంత్రి కేటీఆర్ విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధిని పట్టించుకోని ఆ నాయకులు ఇప్పుడు గడపగడపకు కాంగ్రెస్ పేరుతో తిరుగుతున్నారని విమర్శించారు.

ఎల్లారెడ్డి కాంగ్రెస్‌లో ఇప్పటికే ఇద్దరు నేతలు తన్నుకుంటున్నారని, ముచ్చటగా మూడో కృష్ణుడూ వస్తుండట అంటూ మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డిని ఉద్దేశించి మంత్రి కేటీఆర్ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. బీజేపీకి డిపాజిట్ దక్కకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు జాహ్నవి, సత్యనారాయణ, నాయకులు నిట్టు వేణుగోపాల్‌రావ్, ప్రతాప్‌రెడ్డి, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

జనరంజక పాలన..

ఎల్లారెడ్డి: సీఎం కేసీఆర్‌ది జనరంజక పాలన అని మంత్రి ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీలు హైదరాబాద్‌లా అభివృద్ధి చెందాయన్నారు. నిజామాబాద్ మున్సిపాలిటీలో రూ. 813 కోట్లతో, ఆర్మూర్‌లో రూ. 330 కోట్లు, బోధన్‌లో రూ. 360 కోట్లు, కామారెడ్డిలో రూ. 179 కోట్లు, బాన్సువాడలో రూ. 116 కోట్లు, ఎల్లారెడ్డిలో రూ. 72.77 కోట్లు, భీమ్‌గల్‌లో రూ. 78 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్ తెలంగాణ ఉద్యమంలో మొదటి ఉద్యమకారుడన్నారు. నియోజకవర్గ



అభివృద్ధికి సీఎంతో పాటు అందరు మంత్రులు సహకరిస్తారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సురేందర్ కోరిన విధంగా ఎల్లారెడ్డి నియోజకవర్గానికి మరో 3 వేల ఇళ్లు మంజూరు చేసే విషయమై సీఎంతో మాట్లాడతానన్నారు.

‘గంప’ నేతృత్వంలో అభివృద్ధి

కామారెడ్డిలో జరిగిన కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ స్థానిక ఎమ్మెల్యే గంప గోవర్ధన్ నేతృత్వంలో చురుకుగా అభివృద్ధి జరుగుతోందని ప్రశంసించారు. కామారెడ్డికి మెడికల్ కాలేజీ వచ్చిందన్నారు. ఎన్ని నిధులు కావాలన్నా ఇస్తున్నామన్నారు. కాగా ఎల్లారెడ్డిలో ఎమ్మెల్యే సురేందర్‌ను రెట్టింపు మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చిన కేటీఆర్.. కామారెడ్డి విషయంలో ఎలాంటి ప్రకటన చేయకపోవడం ఆయన అనుచరులను కొంత నిరాశపరిచింది.

పోలీసుల ఓవరాక్షన్

మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో పోలీసుల ఓవరాక్షన్ సామాన్యులను ఇబ్బందికి గురిచేసింది. మంత్రి కాన్వాయ్ రాకముందే చాలా చోట్ల రోడ్లను బ్లాక్ చేయడంతో వాహనదారుల ఇబ్బందులు పడ్డారు. ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద మీడియాతో, ఇతర వర్గాలతో కొందరు పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. అయితే ప్రతిపక్ష పార్టీల నేతలను ముందస్తుగా అరెస్టు చేసినా, కామారెడ్డి మున్సిపల్ శివారులో, లింగంపేట మండల కేంద్ర శివారులో కాంగ్రెస్ శ్రేణులు కేటీఆర్ కాన్వాయ్‌ను అడ్డుకునే ప్రయత్నం చేయడం విస్మయానికి గురిచేసింది.

మనసున్న మారాజులు..

ఎల్లారెడ్డి: మనసున్న మారాజులు మంత్రులు కేటీఆర్, ప్రశాంత్‌రెడ్డిలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ పేర్కొన్నారు. వారి సహకారంతో గాంధారి మండలంలో రూ. 50 కోట్లతో, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో రూ. 72.77 కోట్లతో అభివృద్ధి పనులు చేశానన్నారు. సర్పంచులు, ఎంపీటీసీల కోరిక మేరకు నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ. 50 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. పెద్ద చెరువు కట్టపై వంతెనల నిర్మాణం, చిల్డ్రన్స్ పార్కు, ఆర్టీసీ బస్టాండ్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులకు నిధు



లు మంజూరయ్యాయన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం మరిన్ని నిధులు మంజూరు చేయాలని కోరారు.



ఎల్లారెడ్డి: ఆర్టీసీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు



బహిరంగ సభలో పాల్గొన్న ప్రజలు

‘ఫ్లెక్సీలో మా ఫొటోలెందుకు పెట్టారు’

కామారెడ్డి టౌన్: మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన స్వాగత ఫ్లెక్సీలో బీజేపీ కౌన్సిలర్ల ఫొటోలు పెట్టడం ఎంతవరకు సమంజసమని ఆ పార్టీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ శ్రీకాంత్ ప్రశ్నించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ విషయమై మున్సిపల్ అధికారులను ప్రశ్నిస్తే తమకు సంబంధం లేదని సమాధానం ఇచ్చారన్నారు. ప్రొటోకాల్ పేరుతో బీఆర్‌ఎస్ నాయకులు ఇలా చేయడం తగదన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో కామారెడ్డి పట్టణం అధ్వానంగా తయారయ్యిందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆకుల భరత్ ఆరోపించారు.

జిల్లా కేంద్రంలో డ్రెయినేజీ వ్యవస్థ దరిద్రంగా ఉందన్నారు. పైపై మెరుగులతో ప్రజల్ని మోసం చేయవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నరేందర్, శ్రీనివాస్, పండ్ల ప్రవీణ్, సుతారి రవి, నాయకులు అన్మండ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ కౌన్సిలర్ శ్రీకాంత్

ఆంక్షలు, ముందస్తు అరెస్టులు

కామారెడ్డి టౌన్ : జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో పోలీసులు కఠినమైన ఆంక్షలు విధించారు. నర్సన్నపలి బైపాస్ వద్ద జాతీయ రహదారి నుంచి కామారెడ్డి పట్టణంలోకి వచ్చే రహదారిని పూర్తిగా మూసివేశారు. బస్సులు, వాహనాలను సిరిసిల్లారోడ్డు మీదుగా దారి మళ్లించారు. కాంగ్రెస్, బీజేపీ, వామపక్షాలు, వివిధ సంఘాల నేతలను ముందస్తుగా అరెస్టు, హౌస్ అరెస్ట్ చేశారు. హౌసింగ్ బోర్డు వద్ద వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన ఏఎన్‌ఎంలను అరెస్ట్ చేసి స్టేషన్‌ను తరలించారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద జర్నలిస్టులకూ అనుమతి ఇవ్వలేదు. గోడు వినిపించుకునేందుకు వచ్చిన డెయిరీ కళాశాల సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఐసీడీఎస్ ఉద్యోగులు, టీఎన్జీవోస్ నాయకులను మంత్రిని కలవడానికి అనుమతించలేదు. తన గొంతు నులిమి అరెస్టు చేశారని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సందీప్ ఆరోపించారు.

మంత్రి కేటీఆర్‌కు నిరసన సెగ

కామారెడ్డి టౌన్: మంత్రి కేటీఆర్‌కు నిరసన సెగ తగిలింది. సోమవారం కామారెడ్డి పర్యటన పూర్తి చేసుకుని ఎల్లారెడ్డి వెళ్తున్న క్రమంలో దేవునిపల్లిలోని దేవివిహార్ సమీపంలో కాంగ్రెస్ నాయకులు ఒక్కసారిగా కేటీఆర్ కాన్వాయ్‌కు ఎదురెళ్లారు. కేటీఆర్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. మంత్రి పర్యటన సందర్భంగా అర్ధరాత్రి నుంచే పలువురు నేతలను అదుపులోకి తీసుకున్నా ఇలాంటి ఘటన జరగడంతో పోలీసులు కంగుతిన్నారు. కాన్వాయికి అడ్డుగా వచ్చిన కాంగ్రెస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో పోలీసులు స్వల్పంగా లాఠీచార్జి చేసి, కొందరిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



కాంగ్రెస్ నేతలను అరెస్ట్ చేస్తున్న పోలీసులు



పోలీస్ స్టేషన్‌లో ఏఎన్‌ఎంలు, నాయకులు

పంద్రాగస్టుకు ఏర్పాట్లు పూర్తి

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో మంగళవారం నిర్వహించే స్వాతంత్య్ర దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 11 గంటలకు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం జిల్లా పురోగతిపై ఆయన ప్రసంగిస్తారు. శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రశంస పత్రాల ప్రదానం, స్టాల్స్ సందర్శన తదితర కార్యక్రమాలు ఉంటాయని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.



ఇందిరాగాంధీ స్టేడియంలో ఏర్పాట్లు

క్లుప్తంగా

కొబ్బరి బోండంపై మహాత్ముడు





మద్నూర్(జుక్కల్): స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకొని మద్నూర్‌కు చెందిన పండరి, కొబ్బరి బోండంపై మహాత్మా గాంధీజీ పెయింటింగ్ వేశాడు. ప్రత్యేకంగా ఉండాలని ఇలా చేశానని ఆయన సాక్షితో చెప్పారు.

సుభద్రకు ప్రెసిడెంట్స్ గోల్డ్ మెడల్ అవార్డు



బోధన్‌టౌన్(బోధన్): విశాఖపట్టణంలోని ఐఐపీఈ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ) కళాశాలలో బీటెక్, కెమికల్ ఇంజినీరింగ్ విద్యనభ్యసించి ప్రతిభ కనబర్చిన బోధన్‌కు చెందిన విద్యార్థిని సుభద్ర జాంకార్‌కు ప్రెసిడెంట్స్ గోల్డ్ మెడల్ అవార్డు లభించింది. ఐఐటీ విద్యా సంస్థల్లో అకాడామిక్ ఎక్సలెన్స్‌కు ఇది అత్యుత్తమ పురస్కారం. ఈ పురస్కారాన్ని ఇటీవల విశాఖపట్టణంలో ఏర్పాటు చేసిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ హానరీ శాస్త్రవేత్త అర్చణ భట్టాచార్య అందజేశారు. సుభద్ర యూఎస్‌ఏలోని న్యూయార్క్ కార్నెల్ విశ్వవిద్యాలయంలో కెమికల్ ఇంజినీరింగ్‌లో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ విద్యను అభ్యసిస్తుంది. అత్యుత్తమ అవార్డు అందుకున్నందుకు సుభద్ర తల్లిదండ్రులు డాక్టర్ మకరంద్, అంజలి జాంకార్‌లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నిజామాబాద్-2 డిపో మేనేజర్‌గా సాయన్న

ఖలీల్‌వాడి: నిజామాబాద్–2 డిపో మేనేజర్‌గా సాయన్న సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నిర్మల్ డిపో నుంచి నిజామాబాద్‌కు ఆయన బదిలీపై వచ్చారు. నిజామాబాద్–2 డిపోలో ఉన్న మేనేజర్ వెంకటేశం బదిలీపై వరంగల్–1 డిపోకు వెళ్లారు. గతంలో సాయన్న డిపో మేనేజర్‌గా జిల్లాలో పనిచేశారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి



భిక్కనూరు: యునివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులపై ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపడం తగదని కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ గుప్తా అన్నారు. సోమవారం సౌత్‌క్యాంపస్‌లో కాంట్రాక్ట్ అధ్యాపకులు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల మంత్రి కేటీఆర్‌కు కూడా వినతిపత్రం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు తెలంగాణ విశ్వవిద్యాలయ అధ్యక్షుడు డాక్టర్ దత్తహరి, కాంట్రాక్ట్ అధ్యాపకులు నాగేశ్వర్‌రావు, కిరణ్ రాథోడ్, గోపిరాజు, యా లాద్రి, సునీత తదితరులున్నారు.

మంత్రి కేటీఆర్‌కు వినతుల వెల్లువ



ఎల్లారెడ్డిలో కేటీఆర్‌తో మాట్లాడుతున్న హోంగార్డులు



వినతిపత్రం ఇస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి కేటీఆర్‌కు సోమవారం పలువురు వినతిపత్రాలు అందజేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఎల్లారెడ్డిలో, కామారెడ్డిలో వినతిపత్రాలు అందజేశారు. కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘానికి కేటాయించిన స్థలంలో పక్కా భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేయాలని ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్‌జీవోల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరాల వెంకట్ రెడ్డి, బి.సాయిలు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో క్రమబద్ధీకరణ కాకుండా ఉన్న వొకేషనల్, ఇతర అధ్యాపకులకు న్యాయం చేయాలని, కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలని తెలంగాణ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నీలం నర్సింలు కేటీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. అలాగే కొత్తగా ఏర్పాటు చేసిన బీబీపేట జూనియర్ కళాశాలలకు సిబ్బందిని వెంటనే నియమించాలని కోరారు. కేటీఆర్‌ను ఎల్లారెడ్డిలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దఫేదార్ శోభరాజు దంపతులు కలిసి జిల్లా, మండల పరిషత్‌ల అభ్యున్నతికి నిధులు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. తమను పర్మినెంట్ చేయాలని కోరుతూ జిల్లాకు చెందిన హోంగార్డులు వినతిపత్రాలు అందించారు.

సభకు తరలివెళ్లిన బీఆర్‌ఎస్ శ్రేణులు

ఎల్లారెడ్డి పట్టణంలో నిర్వహించిన కేటీఆర్ సభకు జిల్లాలోని పలు మండలాల నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. వారికి స్థానికంగా ప్రత్యేకంగా వాహనాలను ఏర్పాటు చేశారు.

భారీ బందోబస్తు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో మంత్రి కేటీఆర్ పర్యటన దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు భారీగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు. బందోబస్తులో ఎల్లారెడ్డి, బాన్సువాడ, నిజామాబాద్ డీఎస్పీలు శ్రీనివాసులు, జగన్నాథరెడ్డి, రవీందర్‌రెడ్డిలతో పాటు, 16 మంది సీఐలు, 55 మంది ఎస్సైలు, 47 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 264 మంది పీసీలు, 135 మంది హోంగార్డులు, 62 మంది మహిళా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



వినతి పత్రం అందజేస్తున్న టీఎన్‌జీవో నేతలు



మంత్రులను గజమాలతో సన్మానిస్తున్న నేతలు



కేటీఆర్‌తో జెడ్పీచైర్‌పర్సన్ శోభ దంపతులు

అభివృద్ధి బాటలో కామారెడ్డి

- మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్
- పట్టణంలో రూ.28 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం
- పట్టణ అభివృద్ధికి ప్రత్యేకంగా రూ.45 కోట్ల నిధులు మంజూరు



అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేస్తున్న మంత్రి కేటీఆర్ తదితరులు

కామారెడ్డి టౌన్: సీఎం కేసీఆర్, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ నేతృత్వంతో కామారెడ్డి అభివృద్ధి బాటలో దూసుకుపోయిందని మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. జిల్లా కేంద్రంలో ఆయన రూ. 28 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. జాతీయ రహదారి నర్సన్నపల్లి వద్ద రూ. 81లక్షలతో నిర్మించిన స్వాగత తోరణం, ఎన్‌హెచ్–44 నుంచి ఈఎస్‌ఆర్ గార్డెన్ వరకు రూ. కోటి 60 లక్షలతో నిర్మించిన సెంట్రల్ లైటింగ్, ఈఎస్‌ఆర్ గార్డెన్ నుంచి రూ. 2.31 కోట్లతో సెంట్రల్ లైటింగ్, రూ.7 కోట్లతో ఆరు లేన్ల రహదారి విస్తరణ, రూ. 1.60 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు, టేక్రియాల్ నుంచి బస్టాండ్ వరకు సెంట్రల్ డివైడర్‌లు, టేక్రియాల్ నుంచి ఈఎస్‌ఆర్ గార్డెన్ వరకు బీటీ రోడ్డు విసర్తణ మొత్తం రూ.27.99 కోట్లుతో చేపట్టిన అభివృద్ధి పనులను నర్సన్నపల్లి, హౌజింగ్‌బోర్డు, ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ముందు శిలాఫలకాలకు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి పట్టణ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా రూ. 25కోట్లు మంజూరు చేస్తున్నామన్నారు. స్టేడియం అభివృద్ధి, అంతర్గత రహదారులు, స్పోర్ట్స్ కాంప్లెక్స్ కోసం మరో రూ.20 కోట్లు మంజూరు చేస్తూ జీవో కూడా విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎంపీ బీబీపాటిల్, జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబోద్దిన్, కలెక్టర్ జితేష్ వి పాటిల్, మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి, వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియా, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో పలు అభివృద్ధి పనులకు..



ఎల్లారెడ్డిలో బ్రిడ్జిని ప్రారంభిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, కేటీఆర్ తదితరులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): రూ.5 కోట్లతో ఎల్లారెడ్డి పెద్ద చెరువు కట్టపై నిర్మించిన బ్రిడ్జిని మంత్రి ప్రశాంత్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. అనంతరం రూ.4 కోట్లతో నిర్మించనున్న మున్సిపల్ భవనం, రూ.2 కోట్లతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్, రూ.4 కోట్లతో నిర్మించనున్న బస్టాండ్ పనులకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేయగా, రూ.80 లక్షలతో నిర్మించిన చిల్డ్రన్ పార్కు పనులను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జాజాల సురేందర్, జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, కలెక్టర్ జితేష్ వీ పాటిల్, అదనపు కలెక్టర్ మను చౌదరి, ఎంపీ సురేష్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తాడ్వాయిలో మినీ స్టేడియం నిర్మాణానికి..



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో సోమవారం మినీ స్టేడియం నిర్మాణానికి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. తాడ్వాయిలోని ఊర గట్టుపై మినీ స్టేడియం నిర్మాణ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రూ.2.5 కోట్ల నిధులను మంజూరు చేసింది. శబరిమాత ఆశ్రమం వద్ద మంత్రికి బీఆర్‌ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఎంపీపీ రవి, పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ నర్సింలు, సర్పంచ్ సంజీవులు, తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిలో బైక్ ర్యాలీ..

- తరలివచ్చిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు



కేటీఆర్ పర్యటన సందర్భంగా బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రభుత్వవిప్ గంపగోవర్ధన్

కామారెడ్డి క్రైం: పలు అభివద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు జిల్లా కేంద్రానికి మంత్రి కేటీఆర్ రావడం బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్ నింపింది. రెండు రోజుల ముందు నుంచే ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రభుత్వవిప్ గంప గోవర్ధన్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ఎంకే ముజీబొద్దిన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల నుంచి ముఖ్యనాయకులు, కార్యకర్తలు సోమవారం జరిగిన కేటీఆర్ పర్యటనకు భారీగా తరలివచ్చారు. పట్టణంలో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీలు చేపట్టారు. పోలీసులు భారీ బందోబస్తు చర్యలు చేపట్టారు. ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, డీఎస్పీ ప్రకాష్‌ల ఆధ్వర్యంలో బలగాలను మోహరించారు. ముందుగా ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకున్న మంత్రి కేటీఆర్‌కు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతం పలికారు. కామారెడ్డిలో అభివృద్ధి పనులను ప్రారంభించి అనంతరం ఎల్లారెడ్డికి తరలివెళ్లారు.

అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దు

- ప్రజావాణికి 150 ఫిర్యాదులు
- వినతులు స్వీకరించిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



కలెక్టరేట్‌కు తరలివచ్చిన పశు సంవర్ధక శాఖ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

సుభాష్‌నగర్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 150 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, డీఆర్డీవో చందర్, డీపీవో జయసుధ, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి రెండో ఏఎన్‌ఎంల సమ్మె

వైద్య, ఆరోగ్యశాఖలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, దీన్ని నిరసిస్తూ 16 నుంచి రెండో ఏఎన్‌ఎంలు సమ్మెకు దిగుతున్నారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై ఓమయ్య పేర్కొన్నారు. సోమవారం ఈ మేరకు సమ్మె నోటీసులను ప్రజావాణిలో కలెక్టర్, డీఎంఅండ్‌హెచ్‌ఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓమయ్య మాట్లాడుతూ ఈనెల 2వ తేదీన వైద్యారోగ్యశాఖ కమిషనర్, ప్రభుత్వానికి సమ్మె నోటీస్ ఇచ్చినా నేటికీ స్పందన లేదన్నారు. అందుకే ఈనెల 16 నుంచి సమ్మెకు వెళ్తున్నామన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు భాగ్యమ్మ, కార్యదర్శి సంధ్యారాణి, నాయకులు రమాదేవి, రాణి, భాగ్యలక్ష్మి, కళావతి, హన్మాండ్లు, తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలపై విచారణ చేపట్టాలి

పశుసంవర్ధక శాఖలో గోపాలమిత్ర ఎంపికలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని బాల్కొండ నియోజకవర్గానికి చెందిన బి తరుణ్‌కుమార్ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గోపాలమిత్ర ఎంపిక కోసం సర్పంచ్ తీర్మానపత్రంతో దరఖాస్తు చేసుకున్నానని, అర్హుడినైన నన్ను తప్పించి కామారెడ్డి జిల్లా దోమకొండకు చెందిన వ్యక్తిని నియమించారన్నారు. అధికారులు తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

వీఆర్‌ఏల పోస్టులను రద్దు చేయాలి

పశుసంవర్ధక శాఖలో నియమించిన వీఆర్‌ఏల పోస్టులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ 18 ఏళ్లుగా మూగ జీవాలకు పశువైద్య, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పని చేస్తున్నామన్నారు.

జీవో ఎంఎస్ నం. 81, 85 ప్రకారం పశు సంవర్ధక శాఖలో వీఆర్‌ఏలను నియమిస్తున్నట్లు ఎక్కడా లేదని, కానీ 48 మంది వీఆర్‌ఏలకు పోస్టింగులిచ్చారన్నారు. దీంతో ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న 24 మందిని తిరిగి విధుల కు తీసుకోవాలన్నారు. లేకుంటే 24 కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో 24 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

'సమస్యల్ని తీర్చకపోవడం శోచనీయం'



కామారెడ్డి రూరల్: కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 50 రోజులు పూర్తయినా తమ సమస్యల్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమని పార్ట్‌టైం స్వీపర్లు ఆవేదన వ్యక్తం చేశారు. తాము దీక్షలు చేపడుతుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేదని మండిపడ్డారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించి రూ.27 వేల వేతనం చెల్లించాలన్నారు. అనంతరం కామారెడ్డికి వచ్చిన మంత్రి కేటీఆర్‌కు వినతి పత్రం అందజేశారు. పార్ట్‌టైం స్వీపర్లు బాలయ్య, సిద్ధిరాములు, మునీరొద్దీన్, గంగయ్య, మల్లేషం, తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఒకరి హత్య



విజయ్ మృతదేహం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి హనుమాన్ ఆలయం వద్ద తాగిన మైకంలో స్నేహితుల మధ్య జరిగిన వాగ్వాదం హత్యకు దారితీసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లిలో నివాసముంటున్న విజయ్(29) మరో ఇద్దరు స్నేహితులతో కలిసి ఆదివారం రాత్రి హనుమాన్ ఆలయం సమీపంలో మద్యం సేవించాడు. తాగినమైకంలో ముగ్గురి మధ్య గొడవ జరిగగా విజయ్ ఇంటికి వచ్చేశాడు. కొద్దిసేపటి తర్వాత ఇద్దరు మిత్రులు విజయ్ ఇంటికి వచ్చి కర్రలతో చితకబాది హత్యచేసి అక్కడి నుంచి పరారయ్యారు. విజయ్‌ను కొడుతున్న సమయంలో విజయ్ అన్నావదిన, పిల్లలు భయంతో పారిపోయారు. ఆ తర్వాత కుటుంబసభ్యులు ఇంటికి వచ్చి విజయ్‌ను పలకరించక మాట్లాడకపోవడంతో మృతిచెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు తెలిపారు. మృతుడు, ఇద్దరు స్నేహితులకు నేరచరిత్ర ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

టోల్‌ప్లాజా బూత్‌లను ఢీకొన్న డీసీఎం



భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలోని జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజా వద్ద సోమవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో టోల్‌ప్లాజా బూత్‌లు ధ్వంసమై ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎంను డ్రైవరు అజాగ్రత్తగా నడిపి అతి వేగంగా వచ్చి 4, 5 టోల్ బూత్‌లను ఢీకొట్టాడు. దీంతో టోల్‌ప్లాజా బూత్‌లు రెండు ధ్వంసమయ్యాయి. వెంటనే డీ సీఎం డ్రైవర్‌ను పోలీసులకు అప్పగించారు. పోలీసులు డ్రైవర్‌ను పరీక్షించగా మద్యం సేవించి ఉన్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రైం కార్నర్

శ్రీనగర్‌లో చోరీ



వైన్ షాప్‌లో చోరీకి పాల్పడుతున్న అగంతకులు

వర్ని: వర్ని పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీనగర్‌లో సోమవారం తెల్లవారుజామున ఇల్లు కిరాణా షాప్, వర్ని మండల కేంద్రంలోని లక్ష్మీ వైన్స్‌లో దొంగలు చొరబడి నగదు బంగారం కిరాణా వస్తువులను, మద్యం బాటిళ్లను చోరీ చేసినట్లు వర్ని ఎస్సై కృష్ణకుమార్ వెల్లడించారు. సుబ్బారావుకు చెందిన ఇల్లు, కిరాణా షాప్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి నగదు రూ.20 వేల నగదు, 4 తులాల బంగారం, వైన్స్‌లో సుమారు రూ. 50 వేల విలువగల మద్యం బాటిళ్లు ఎత్తుకెళ్లినట్లు బాధితులు వెల్లడించారు. పోలీసులు క్లూస్ టీం ఆధారాలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

జైతాపూర్‌లో ఆటో..

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండలంలోని జైతాపూర్ గ్రామంలో ఇంటివద్ద నిలిపిన ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బాధితుడు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహించడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

దేవాలయంలో..

ఖలీల్‌వాడి: నగరంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న రాఘవేంద్ర స్వామి దేవస్థానంలో చోరీ జరిగినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. ఆదివారం రాత్రి మేనేజర్ నీలకంఠరావుతో పాటు పురోహితుడు ఆలయానికి తాళంవేసి వెళ్లి సోమవారం ఉదయం వచ్చి చూడగా మెయిన్ గేట్‌తో పాటు గుడితాళాలు పగలగొట్టి ఉన్నాయన్నారు. ఇందులో నుంచి 3 రాగిబిందెలు, ఒకటి ఇత్తడి బిందె తదితర సామగ్రి చోరీకి గురయ్యాయని ఆలయ మేనేజర్ నీలకంఠరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నవనాథపురం పాఠశాలలో..

ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ పట్టణంలోని పెద్దబజార్‌లోని రాంమందిర్ పాఠశాల ఆవరణలో ఉన్న నవనాథపురం స్కూల్‌లో అగంతకులు చోరీకి పాల్పడ్డారు. స్కూల్‌లో వంట గది తాళం ధ్వంసం చేసి వంటసామగ్రిని ఎత్తుకెళ్లారని హెచ్‌ఎం చంద్రశేఖర్ తెలిపారు.

చెట్టును ఢీకొన్న కారు: నలుగురికి గాయాలు





డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): జిల్లాలోని డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధి లో వెస్లీనగర్ తండా సమీపంలో 44వ నెంబరు జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో నిర్మల్‌కు చెందిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం నారగోని సంజీవ్ గౌడ్ తన కుటుంబ సభ్యులతో కలిసి కారు (టీఎస్ 18 ఈ 4152)లో హైదరాబాద్ నుంచి నిర్మల్‌కు వెళ్తున్నారు. వెస్లీనగర్ తండా వద్దకు రాగానే కారు అదుపు తప్పి రహదారి కిందకు దిగిపోయి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాలుగేళ్ల పాపతో పాటు కారులో ఉన్న ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు డిచ్‌పల్లి పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. గాయపడిన వారిలో నార గోని సంజీవ్‌గౌడ్, అతని భార్య సుజాత, కూతురు సంధ్యారాణి (పంచాయతీ కార్యదర్శి), మనుమరాలు వేద కృతిక ఉన్నారు. బాలిక పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. డిచ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీ: ఒకరి మృతి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మండలంలోని శివాపూర్ శివారులో సోమవారం రాత్రి రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. మండలంలోని వెల్లుట్ల గ్రామానికి చెందిన వడ్ల చంద్రయ్య (45) నాగిరెడ్డిపేట మండలంలోని బొల్లారం గ్రామానికి వెళ్లి బైక్‌పై తిరిగి వస్తున్నారు. ఎల్లారెడ్డి నుంచి లింగంపేట మండలంలోని ఎక్కపల్లితండాకు చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెళ్తుండగా రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో చంద్రయ్య సంఘటన స్థలంలో మృతి చెందగా, ఎక్కపల్లి తండాకు చెందిన ఇరువురికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన బాబు, రవిని 108లో ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు వారు తెలిపారు. వీరి పరిస్థితి విషమంగా ఉండడంతో వీరిని కామారెడ్డికి రిఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు.